క్లుప్తంగా

నేడు గృహసారథులకు శిక్షణ

నగరి : స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఆర్కేరోజా శనివారం ఉదయం 11 గంటలకు వడమాలపేట మండలానికి చెందిన గృహ సారథులతో సమావేశం కానున్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచులు ఎంపీటీసీలు, చైర్మన్లు, రాష్ట్ర బోర్డు డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సచివాలయ వలంటీర్లు తప్పక హాజరుకావాలని నాయకులు కోరారు.

కృష్ణంరాజు మృతి పార్టీకి తీరని లోటు

కార్వేటినగరం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేసిన కేసీ కృష్ణంరాజు మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కేసీ కృష్ణంరాజు(72) శుక్రవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఉప ముఖ్యమంత్రి ఆ గ్రామానికి వెళ్లి కృష్ణంరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన కృష్ణంరాజు ఆకస్మికంగా మృతి చెందడం జీర్ణించుకోలేకపోతున్నానని అన్నారు. కృష్ణంరాజు కుటుంబానికి వైఎస్సార్ సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనుంజయవర్మ, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, ధనశేఖర్‌వర్మ ఉన్నారు.

ఏపీయూఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక


నాదముని


హరినాథ్

నింద్ర: ఏపీయూఎస్ ఉపాధ్యాయుల సంఘం మండల అధ్యక్షుడిగా నాదముని, కార్యదర్శిగా హరినాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నింద్ర జిల్లా ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జయరాం, ఉపాధ్యక్షుడిగా మునిరత్నం, కార్యదర్శులుగా హరికృష్ణ, దేనారెడ్డి, పయణి, మధు, మన్మథరావు, మహిళా కార్యదర్శిగా రమాదేవి, క్రీడా కన్వీనర్‌గా సుబ్రమణ్యం ఎన్నికయ్యారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొరస్వామి, కోశాధికారి ధనుంజయులు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రోశయ్య

పుత్తూరు రూరల్: ఎంఎల్‌సీ ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని తహసీల్దార్ రోశయ్య తెలిపారు. ఆయన శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిపై అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మార్చి 13న ఎన్నికలు, 16న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. అప్పటి వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. శనివారం ఉదయం 11-30 గంటలకు ఎన్నికల నియమావళిపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీరువా వితరణ



కార్వేటినగరం: కేఎం పురంలోని అంగన్‌వాడీ కేంద్రానికి శుక్రవారం అదే గ్రామానికి చెందిన మనోజ్‌రాజు, దివ్య దంపతులు తమ కుమారుడు హృత్విక్ పుట్టిన రోజు సందర్భంగా బీరువా వితరణ చేశారు. అనంతరం విద్యార్థులకు కేక్, స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త మాట్లాడుతూ మనోజ్‌రాజు, దివ్య దంపతుల దాతృత్వం అభినందనీయమన్నారు.

సుపరిపాలన కొనసాగింపే లక్ష్యం


సమావేశానికి హాజరైన గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

- ప్రజలు అండదండలే వైఎస్సార్ సీపీ పునాదులు
- పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి
- ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా గృహసారథులు
- మంత్రి ఆర్కేరోజా

నగరి : సుపరిపాలన కొనసాగింపే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల శిక్షణా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలను సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్న, హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కుటుంబంలా సమన్వయంతో పనిచేస్తూ ప్రజాసేవలో జగనన్నకు తోడుగా ఉండాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రజాదరణ చూసి ఓర్వలేక టీడీపీ తన అనుకూల మీడియాలో అబద్ధపు రాతలు రాయిస్తోందని దుయ్యబట్టారు. ఈ నెల 20 నుంచి నిర్వహించే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని అన్ని వార్డు సచివాలయాల్లో విజయవంతం చేయాలన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రికి ప్రతినిధులుగా భావించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ మేలు చేకూరేలా ముఖ్యమంత్రి పలు పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికీ వివరించాలని సూచించారు. ప్రజలు అండదండలే వైఎస్సార్ సీపీ పునాదులన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీలు కన్నియప్ప, వెంకటలక్ష్మి, మండల సచివాలయ కన్వీనర్ హరి, పీఏసీఎస్ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఆర్బీకే అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు మంత్రి రోజాకు ఆహ్వానం



పుత్తూరు రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకొని సదాశివ కోనలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే ఉత్సవాల్లో పాల్గొనాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. వారు శుక్రవారం నగరిలోని మంత్రి నివాసం వద్ద సదాశివకోన ఆలయ పోస్టర్లను మంత్రితో ఆవిష్కరింపజేశారు. మంత్రి మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా సదాశివ కోనకు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి, సదాశివకోన ఆలయ చైర్మన్ జయచంద్రన్, సభ్యులు ఉదయ్‌కుమార్, వాసుదేవరెడ్డి, గోపీరమణ, కమలమ్మ, లక్ష్మీ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం ప్రారంభం

గంగాధరనెల్లూరు: కొట్రకోన గ్రామంలో ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధారణ పూర్తి కావడంతో మహాకుంభాభిషేకం ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆలయంలో అర్చకులు గణపతిపూజ, అనుజ్ఞ, గణపతి హోమం, నవగ్రహ హోమం, ధనపూజ, గోపూజ, వాస్తుశాంతి, వాస్తుబలి, అంకురార్పణ, ప్రథమ కాల యాగశాలపూజ, పూర్ణాహుతి నిర్వహించారు. శనివారం రెండోయాగశాల పూజ, పూజా హోమం, అష్టదళ పూజ, నేత్రదర్శనం ఉంటుందన్నారు. ఆదివారం వేకువజామున విమాన కుంభాభిషేకం, మూలస్థాన కుంభాభిషేకం, మహాకుంభాభిషేకం వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అధ్యక్షుడు రామమూర్తి నాయుడు, ప్రధానకార్యదర్శి యుగంధరాచారి, గౌరవాధ్యక్షురాలు సుభాషిణి తెలిపారు.


విశేషాలంకరణలో మల్లేశ్వరస్వామి

జాబ్ మేళాలో 90 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్


కంపెనీ ప్రతినిధులతో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో సప్తగిరి ఎంటర్ ప్రైజెస్ సహకారంతో నిర్వహించిన జాబ్‌మేళాలో 41 మంది ఎంపికయ్యారు. నిరుద్యోగులకు రేణిగుంట సమీపంలోని మొబైల్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 56 మంది పాల్గొన్నారు. 41 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. సీనియర్ అధ్యాపకులు రమణారెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ భాస్కర్ రాజు, జేసి కోఆర్డినేటర్ నాగార్జున, జేకేసి ఫుల్ టైమ్ మెంటర్ లాల్ బాష పాల్గొన్నారు.

పుత్తూరులో 49 మంది..

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 49 మంది ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.వీరయ్య తెలిపారు. రేణిగుంట సమీపంలోని నియోలిమ్క్ టెలీ కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్‌టీసీపీఎల్ కంపెనీల్లో ఆపరేటర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. 72 మంది హాజరుకాగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 46 మంది, ఇతర కళాశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ ఉషారాణి, శ్రీదేవి, కుమార్, కిషోర్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో ఆధార్ సేవలు


కళాశాలలో ఆధార్ అప్‌డేట్ చేసుకుంటున్న విద్యార్థినులు

నగరి : ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియ. విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలంటే కళాశాలలు, పాఠశాలలకు సెలవు పెట్టాల్సి ఉంటుంది. సర్వర్ పనిచేయకుంటే మళ్లీ దుమ్మా కొట్టాల్సిందే. వారికి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం కళాశాలల్లోనే ఆధార్ అప్‌డేట్ చేసే సౌకర్యాన్ని కల్పించింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన సచివాయల వ్యవస్థ ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక డాక్టర్ ఎంఎస్ఎంఎన్ బాలికల జూనియర్ కళాశాలలో ఉచిత ఆధార్ అప్‌డేషన్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. విద్యార్థుల ఆధార్‌లో ఉన్న సవరణలను సరిచేశారు. 90 మంది విద్యార్థుల ఆధార్ కార్డులు శుక్రవారం అప్‌డేట్ అయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ మురళీ మాట్లాడుతూ అన్ని కళాశాలల్లోను ఉచిత ఆధార్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు ఈ క్యాంప్ కొనసాగుతుందని కమిషనర్ ఆదేశాల మేరకు వరుస క్రమంలో అన్ని కళాశాలల్లోను క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. ఆధార్ సేవలు తమకు అందుబాటులోకి తెచ్చినందుకు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

చెత్త సేకరణతో పారిశుద్ధ్య సమస్య పరిష్కారం


కంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న సర్పంచ్ అయ్యప్ప, రమేష్

పాలసముద్రం : గ్రామాల్లో చెత్త సేకరణతో పారిశుద్ధ్య సమస్య పరిష్కారం అవుతుందని మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆముదాల, పాలసముద్రం చెత్త సేకరణ కేంద్రాలను సర్పంచ్ ఆయ్యప్పతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి, పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలన్నారు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నరేష్, ధరణి, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

దాసరికాలనీ వాసుల సమస్య పరిష్కరించాలి


తహసీల్దార్ బాబుతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని దాసరికాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ఎస్.శ్యామల శుక్రవారం తహసీల్దార్ బాబుకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దాసరికాలనీలోని ఇళ్లు రెవెన్యూ లెక్కల ప్రకారం కాలువ పోరంబోకులో ఉన్నాయన్నారు. వీరు గత 40 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉన్నారని, ఈ సమస్యను డిప్యూటి సీఎం నారాయణస్వామి దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆ భూమికి పట్టా ఉందని రెవెన్యూ అధికారులు చెప్పడంతో కాలనీ వాసుకుల దిక్కుతోచలేదన్నారు. వారి నివాసాలకు పట్టాలు మంజూరు చేయాలని ఆమె తెలిపారు.

వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న న్యాయవాది సంజీవి

పుత్తూరు రూరల్: వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన చర్యలు తప్పవని సీనియర్ న్యాయవాది సంజీవి చెప్పారు. స్థానిక పయనీర్ స్పిన్నింగ్ మిల్లులో శుక్రవారం పుత్తూరు న్యాయ సేవాధికార సంస్థ, కార్మిక శాఖ సంయుక్తంగా వెట్టి చాకిరీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబపరంగా, ఆచారంగా, ఒప్పందం తదితర షరతులతో పనులు చేయించడం వెట్టి చాకిరీ కిందకు వస్తుందని తెలిపారు. వెట్టి చాకిరీని పూర్తి స్థాయిలో నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది మురగేశన్‌రెడ్డి, లేబర్ ఆఫీసర్ హేమాచారి, మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ నట్టల నివారణ దినోత్సవం


దూడలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న వైద్యాధికారి శ్రీవిద్య

శ్రీరంగరాజపురం: కొత్తపల్లిమిట్ట రైతు భరోసా కేంద్రంలో జాతీయ నట్టల నివారణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి కేవీ శ్రీవిద్య ఆధ్వర్యంలో నట్టల నివారణకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నేటి పేయ దూడలే రేపటి పాడి ఆవులని అన్నారు. ముఖ్యంగా పాడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. దూడలకు డీవార్మింగ్ చేస్తే ఎదుగుదల బాగుంటుందని చెప్పారు. అనంతరం 40 దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులు తాపించారు.

శ్రీకాళహస్తికి అడిషనల్ జిల్లా కోర్టు


హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణానికి అడిషనల్ జిల్లా కోర్టు గెజిట్ నోటిఫికేషన్ శుక్రవారం విడుదల అయింది. దీనిపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడుపూరు ప్రసాద్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో శ్రీకాళహస్తి, చుట్టుపక్కల మండలాల ప్రజలందరూ అడిషనల్ జిల్లా కోర్టును ఉపయోగించుకుంటారని తెలిపారు. లా సెక్రటరీ, లా సెక్రటరీ పీఏ, జిల్లా న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియషన్ సభ్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ బెంచ్ అధ్యక్షుడిగా జడ్జి పవన్‌కుమార్

తిరుపతి లీగల్ : సత్యవేడు కోర్టులో శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్ బెంచ్ అధ్యక్షుడిగా తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా జడ్జి భీమారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యవేడు కోర్టులో జరగనున్న లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం, తదితర బాధ్యతలను జడ్జి పవన్‌కుమార్ పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించండి


మాట్లాడుతున్న ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: ఆరోగ్య సూత్రాలు పాటించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్ కోరారు. మండలంలోని ఆవలకండ్రిగ, ఇందిరానగర్ కాలనీల్లో శుక్రవారం అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం ప్రతి ఒక్కరూ డ్రైడే పాటిస్తే దోమల్ని నివారించుకోవచ్చన్నారు. దోమలతో వ్యాప్తి చెందే జ్వరాలను అరికట్టవచ్చన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. రాబోయే వేసవికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ నీరు తాగాలన్నారు. ఎండల్లో తిరగకూడదని, బయటకు వెళ్లాలంటే గొడుగు, లేదా టోపీ పెట్టుకోవాలన్నారు. వడదెబ్బ తగిలితే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందాలన్నారు. సీహెచ్‌ఓ రేవతి, హెల్త్ సెక్రటరీ క్రాంతి, సిబ్బంది శోభ, విజయలక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

జ్ఞానేంద్రరెడ్డిని విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదు


మాట్లాడుతున్న సింగిల్‌విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి

పెనుమూరు (కార్వేటినగరం): జ్ఞానేంద్రరెడ్డిని విమర్శించే అర్హత లోకేష్‌కు, టీడీపీకి, ఆయన తండ్రి చంద్రబాబుకు లేదని సింగిల్‌విండో డైరెక్టర్ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరం కోసం రూ.కోట్ల విలువ చేసే తన సొంత భూములను ప్రభుత్వ భవనాలు, ఆలయాలు, కాలేజీల నిర్మాణానికి ఇచ్చిన ఘనత జ్ఞానేంద్రరెడ్డిదని అన్నారు. భూస్వాములైన జ్ఞానేంద్రరెడ్డి కుటుంబంపై లోకేష్ చేస్తున్న ఆరోపణలు సరికావని అన్నారు. తెలుగు తమ్ముళ్లు, కార్యకర్తలు ఇచ్చిన స్క్రిప్టును వచ్చీ, రానీ తెలుగులో చదవడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. నీకు దమ్ము, ధైర్యం ఉంటే భూ కబ్జాలు పైరవీలపై బహిరంగ చర్చకు సిద్ధామా? అని సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామియాదవ్, చక్రవర్తి నాయుడు, వైస్ ఎంపీపీ కోదండ, రామకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కళ్లు తెరిచి అభివృద్ధిని చూడు లోకేష్

శ్రీరంగరాజపురం: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని లోకేష్ కళ్లు తెరిచి చూడాలని జిల్లా డీసీసీ బ్యాంకు డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం శ్రీరంగరాజపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రెండో పులివెందులగా అభివృద్ధి చెందిన నియోజకవర్గం గంగాధరనెల్లూరేనని, లోకేష్ కళ్లకు పచ్చకామెర్లు వచ్చి అభివృద్ధి పనులు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. పాలసముద్రం మండలం నుంచి పుల్లూరు మీదుగా చిత్తూరు -పుత్తూరు వరకు ఉన్న రోడ్డును మీ తండ్రి చంద్రబాబు పట్టించుకోకపోతే ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలిసి సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లి ఫారెస్టును డీఫారెస్టు చేసి, రోడ్డు వేశారని తెలిపారు. నేడు ఆ రోడ్డుపై పాదయాత్ర చేస్తూ రోడ్లు దుస్థితికి చేరుకున్నాయని చెప్పడం తల్లిపాలు తాగి రొమ్ము మీద తన్నినట్లుందని విమర్శించారు. ముఖ్యమంత్రిని అసభ్య పదజాలంతో దూషిస్తే రేపటి నుంచి మండలంలో పాదయాత్ర కూడా చేయలేవని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రమణ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి కుప్పయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

నారా లోకేష్ పిచ్చి పులకేశి


మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

పాలసముద్రం : యువగళం పేరుతో సాగుతున్న పాదయాత్రలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కుమారుడు లోకేష్ అవగాహన లేకుండా మాట్లాడుతున్న ఒక పిచ్చి పులకేశి అని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ ఆరోపించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రంగాపురం క్రాస్‌లో జరిగిన సభలో నారా లోకేష్ పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువులు ధరలు నియంత్రణ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని, ఆ మాత్రం కూడా అవగాహన లేని లోకేష్ వాటి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన పాదయాత్ర చేసి ఎవరిని ఉద్ధరిద్దామనో అర్థం కావడం లేదన్నారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేసే పనులను టీడీపీ నేతలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా చైర్మన్ పోలయ్య, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రాజు, వరదరాజు, ప్రకాష్, బాబు, గోపి, మనోహర్, పయణి, గోపాల్, రాజామణి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు



నారాయణవనం: పద్మావతీ సమేత వెంకన్న ఆలయంలో శుక్రవారం సాయంత్రం పద్మావతీ అమ్మవారికి గంట పాటు ఉయ్యాల సేవ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవలో మేల్కొన్న స్వామికి నిత్య పూజా కైంకర్యాలలో భాగంగా తోమాల, శుద్ధి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 7 గంటలకు వెంకన్నకు, పద్మావతీ అమ్మవార్లకు శుక్రవార అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం పూజల అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన పద్మావతీ అమ్మవారు ఆలయ ప్రాకారంలో ఊరేగారు. ఉయ్యాలసేవను వీక్షించిన భక్తులు తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

మూషిక వాహనంపై గణనాథుని కటాక్షం


నేటి నుంచి వాహన సేవలు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లె పళ్లికొండేశ్వరాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మూషిక వాహనంపై వినాయకుడు భక్తులను కటాక్షించారు. విఘ్న వినాయకస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మూషిక వాహనంపై అధిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు నడుమ గోమాత ముందు వెళ్లగా స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. ఉభయదారులుగా సురుటుపల్లె ప్రజలు వ్యవహరించారు. తొలుత ఉదయం గ్రామదేవత పొన్నెమ్మకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఏర్పాట్లను ఈఓ రామచంద్రా రెడ్డి, ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు, ఆనందుడు, ఎస్ఎం సురేష్, చిత్ర, సత్య, మునివేలు తదితరులు పర్యవేక్షించారు. ప్రత్యేక ఆహ్వానితులు రాధాక్రిష్టారెడ్డి పాల్గొన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో శనివారం నుంచి 10 రోజుల పాటు నిత్యం వాహన సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. శనివారం పల్లకి సేవ, ఆదివారం చంద్రప్రభ వాహనం, సోమవారం కామదేను వాహనం, మంగళవారం భూతవాహనం, బుధవారం అధికార నంది వాహనం, గురువారం గజ వాహనం, శుక్రవారం అశ్వ వాహనం, శనివారం వృషభ వాహనం, ఆదివారం కల్పవృక్ష వాహనంపై స్వామి వారు భక్తులను అనుగ్రహిస్తారని, సోమవారం రావణబ్రహ్మ, త్రిశూలస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని చెప్పారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని పళ్లికొండేశ్వరాలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ గోడలకు అమర్చిన విద్యుత్ దీప తోరణాలు, దేవతామూర్తుల విద్యుత్ కటౌట్‌లతో కొత్త సొబగులు అద్దుకుంది. వినాయకుడిని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం దర్శించుకున్నారు.